తోడున్న
కొడుకుల నీడలో
సంతోషంగా వున్నా
అతడా సాధుజీవిని
ఎందుకు
మర్చిపోలేకపోయాడు

# పేగుబంధం

ఎస్.కె. నాగేశ్వరరావు
కథ

ఉద్యోగ జీవితంలోంచి రిటైర్ అయినందుకు చాలామందిలా బాధపడలేదు శర్మగారు. పైపెచ్చు ఆనందించారనే చెప్పాలి. కొడుకులిద్దరూ ప్రయోజకులయ్యారు. వాళ్లగురించి చింతలేదు.

కోడళ్లు ఇద్దరూ వినయానికి మారుపేరు. వాళ్లుకూడా హైదరాబాద్‌లోనే ఉద్యోగాలు చేసుకుంటున్నారు. నిజానికి కోడళ్ల మంచితనంవల్లనే ఎవరి బ్రతుకులు వాళ్లు స్వతంత్రంగా బ్రతుకుతున్నా వేరుపడిపోవడంలాంటి ప్రయత్నాల జోలికి పోకుండా రాజధానిలో తండ్రి సంపాదించిన విశాలమైన ఇంటిలో ఉమ్మడి కాపురాల్ని కొనసాగిస్తున్నారు.

శర్మగారికి భార్య గతించి చాలాకాలమైంది. స్వంతిల్లు వున్నా... కొడుకులిద్దరూ అందివచ్చినా చాలాకాలం ఆయనకు వాళ్లతో కలిసి వుండడం పడిందికాదు. రైల్వేస్టేషన్ మాస్టర్‌గిరీ కావడంవల్ల ఆయన రిటైర్ అయ్యేముందు పిల్లలకు దూరంగా ఉత్తర్రపదేశ్‌లోని ఒక చిన్న స్టేషన్‌లో వుండాల్సివచ్చింది. అప్పుడెంతో బాధపడ్డాడాయన.

ఏమయితేనేం రిటైర్‌మెంట్ పుణ్యమాని చివరికి స్వంత గూటికి చేరారాయన. తండ్రి రాకతో కొడుకులు, వాళ్లతోపాటు కోడళ్లు... మనుమడు కూడా చాలా సంతోషించారు.

ఒక నెలరోజులపాటు రిటైర్ జీవితం బాగానే గడిచిపోయింది శర్మగారికి.

ఉదయంపూట స్నానం... పూజాదులు కానిచ్చుకుని మామగారు వచ్చేసరికి, కోడళ్లు వేడివేడి ఫలహారం సిద్ధం చేసేవారు. ఆయన



కు కాఫీ, టీలు గిట్టవు. మిరియాల పొడి కొద్దిగా వేసిన చిక్కటి పాలు పుచ్చుకుంటారు. కోడళ్లు తర్వాత వంటపని ముగించి, భర్తలకు... తమకు... పిల్లాడికి... అందరికీ బాక్సుల్లో లంచ్ సర్దుకుని, శర్మగారికోసం వేడి చల్లారకుండా హాట్‌పాట్స్‌లో సర్ది, దాచివి డైనింగ్ టేబుల్‌మీద అమర్చి వెళ్లేవారు.

సాయంత్రం తిరిగి ఆఫీసుల్నుండి వచ్చాక ఏదైనా ఫలహారం చేయడంకోసం ప్లానుకునేవారు. కొడుకులు మాత్రం స్నానంచేసి కాసేపు రిలాక్స్ కావడమో... షటిల్ ఆడుకోవడమో... లేదా ఫ్రెండ్స్‌తో కాలక్షేపంకోసం బయటకు వెళ్లడమో చేసేవారు. మనుమడు సందీప్ వచ్చీ రావడమే తాతగారి వాడిలోకి చేరిపోయి ఆ రోజు కాన్వెంట్లో జరిగిన విశేషాలన్నీ ఏకరువు పెట్టేవాడు.

ఇహ — సాయంత్రమంతా శర్మగారికి వాడితో ఆటపాటలు, కాస్త పొద్దుపోయినతర్వాత టీవీ చూడ్డం, కుటుంబంతో కలిసి భోజనం కానిచ్చి నిద్రకుపక్రమించడం దినచర్యగా మారింది.

అయితే వచ్చిన చిక్కల్లా వాళ్లంతా ఉదయంపూట వెళ్లిపోయి, సాయంత్రం వేళకి ఇంటికి వచ్చేసరికి మధ్యలో వున్న సమయమంతా గడవడమే. రిటైరైన మొదటి నెలవరకూ ఆ విశ్రాంతి బాగానే వుండేది. కాని నెలలు గడుస్తున్నకొద్దీ అదే భరించరానిదయ్యింది ఆయనకి.

'తనకూ ఏదన్నా వ్యాపకం వుంటే బావుణ్ను' అనుకున్నారాయన.

ఆ వ్యాపకం అనే దానివెనుక ఆయనలో చిరకాలంగా దాగివున్న ఓ కోరిక కూడా వుంది. అందుకు ఆయన బాల్యమే కారణం.

శర్మగారు పుట్టి పెరిగిందంతా పాడి, పంటలకు నిలయమైన కోనసీమలోనే. ఆయన తండ్రి ఇంట్లో పాడి పుష్కలంగా వుండేది. కామధేనువుల్లాంటి రెండు ఆవులు అందించే పాడిలో ఆ ఇంట్లో పాలు, పెరుగు, వెన్నలకు ఎద్దడి అనేది లేకుండా ఇబ్బడి ముబ్బడిగా వుండేవి.

ఆయన మంచి వయస్సులో వున్నరోజుల్లో అరలీటరు పట్టే వెండి చెంబుతో ఆరారగా అప్పుడే పితికిన పచ్చిపాలు ప్రొద్దుటే తాగేవారు. తరువాత చదువులకు పట్నం వెళ్లడం... అదయిన తర్వాత వెంటనే స్టేషన్‌మాస్టర్ ఉద్యోగం రైల్వేలో రావడంతో జీవితంలో చాలాభాగం దేశంలోని ఊళ్లవెంబడి తిరగడంతోనే సరిపోయింది.

ఉద్యోగ జీవితంలో గుమ్మపాలకీ... వెన్న మీగడలకు చోటెక్కడుంటుంది?!

ఉద్యోగంనుండి రిటైరవుతున్నప్పుడు శర్మగారుసంతోషించింది ఇందుకే. ఎలాగైనా పూర్వపు గుమ్మపాల ప్రాభవాన్ని రాజధానిలోనే పునరుద్ధరించుకోవాలనుకున్నారాయన.

ప్రస్తుతం ఇంటి అవసరాలకు వాడుతున్నవి పాకెట్ పాలే. అలా పాకెట్లలో వచ్చేది పాడే కాదన్నది ఆయన నమ్మకం. అందుకే ఒకఆవుని పెంచితే బావుంటుందనుకున్నారు. అనుకోవడమేమిటి... ఇద్దరుకొడుకులతో ఆ ముక్క అనేయడం కూడా జరిగిపోయింది.

తండ్రి తమని ఏదైనా అడగడమే అదృష్టంగా భావిస్తారు వాళ్లిద్దరూ. తమ భవిష్యత్ కోసం ఆయన శ్రమించిందీ... తనని తాను ఎంత నిరాడంబరంగా మలచుకున్నదీ వాళ్లకు తెలియందికాదు.

వారంరోజులు గడవకుండానే ఆ ఇంటి పెరట్లోకి గోమాలక్ష్మి ప్రవేశంజరిగిపోయింది.

◇ ◆ ◇

ఇప్పుడు శర్మగారికి చేతినిండా పనే.

ఆవు సంరక్షణపనులు చూసుకునేందుకు తండ్రికి సాయంగా కొడుకులిద్దరూ ఓ పార్ట్‌టైం జీతగాణ్ణి ఏర్పాటుచేసినా, అన్నిప

మలు తనచేతులమీదే చేసుకునేవారాయన.

గోడకు ఆన్చి గుంజలతోనూ, ఆస్‌బెస్టాస్ రేకులతోనూ చిన్న పాకొకటి ఆ ఇంటి పెరట్లో ఆవుకోసం తయారైంది. దాంట్లో కట్టుకొయ్య, కుడితి పెట్టేందుకు సిమ్మెంటు తొట్టె... చిట్టు, తౌడు బస్తాలు ఓ ప్రక్క... చిన్న ఎండుగడ్డిమోపు అన్నీ అమరిపోయాయి.

ఆవును రోజుకు రెండుపూటలా కడిగి శుభ్రం చేయడానికి వీలుగా డ్రైనేజీ కనెక్షన్ వుండేలా సిమెంట్‌తో చప్టా పాకకు దగ్గర్లోనే తయారైంది. ఇంటికి వాటర్ సప్లై చేసే ఓవర్‌హెడ్ ట్యాంకుకు నీళ్లు తోడడానికి మోటర్ ఇంజన్ వుంది కనుక నీళ్ల సమస్య ఆవు వచ్చినా పెద్దగా లేనట్టే.

మామగారు ముచ్చటపడి తీర్చుకుంటున్న కోరికను కోడళ్లిద్దరూ చిరునవ్వుతో చూస్తున్నారు.

సందీప్‌కు మాత్రం అంతా చిత్రంగా వుంది. ఇంతకాలం పాలు 'మిల్క్ బూత్‌ల లోని మిషన్లమీదే తయారై' వస్తాయనుకునేవాడు. అలాంటిది వింతగా... విచిత్రంగా... మనిషిలాగే కళ్లు తిప్పే... నీళ్లు తాగే... తాత పెట్టింది తినే... నాలుగు కాళ్లు, తోక వున్న యంత్రం తన పెరట్లోకి వచ్చి పాలివ్వడం చూస్తుంటే వాడి ఆశ్చర్యానికి అంతే లేదు.

శర్మగారి కాలక్షేపానికి దాన్నుండి లభించిన ఆనందానికి అవధుల్లేవు. ప్రొద్దుటా, సాయంత్రం తనే ఆవు పొదుగు శుభ్రం చేసి పాలు పితకడం, ఆ వెంటనే కమ్మని ఆ గుమ్మపాలు తాగడం సరేసరి. వేళకు అది తిండి తినేలా దాన్ని గమనిస్తూ కూచోవడం... కుడితి, నీళ్లు పెట్టడం... ఈ పనులతో ఆయనకు తీరికే వుండడంలేదు.

ఆయన కొడుకులు కుదిర్చిన పార్ట్‌టైం జీతగాడు ఆవు దగ్గర తాను చేసే పని లేకపోవడంతో సిటీకి దూరంగా రూరల్ ఏరియాలో పచ్చగడ్డి తేవడంకోసం వారంలో మూడు నాలుగు సార్లు వెళ్లేవాడు.



శర్మగారి కోడళ్లకూ ఇది బాగానే వుంది. పాలకు ఇంట్లో ఫ్రెండ్స్ వచ్చినా కొరత వస్తుందన్న బెంగలేదు. కర్ఫ్యూ, కరెంట్ కోతల్లాంటివి ఏర్పడ్డా నగరంలో పాలు దొరక్క గతంలోలా ఇబ్బందులు పడాలన్న భయమూ లేదు.

ఆవు శర్మగారికి బాగా మాలిమి అయిపోయింది. రోజులు గడుస్తున్నాయి. అలా గడిచే రోజులతోపాటు కొన్ని సంఘటనలూ జరిగి పోతుంటాయి.

◇ ◆ ◇

ఏ ఒక్క మనిషితోగానీ... వస్తువుతోగానీ... జంతువుతోగానీ కొన్ని సుఖాలు... సౌకర్యాలతోపాటు అంతో, కొంతో ఇబ్బందులూ వుంటాయి.

శర్మగారికిప్పుడు గోక్షీరంతోపాటు కొన్ని చికాకులుకూడా వచ్చి కూర్చున్నాయి.

ఆయన పడకగదికి ఆవుకోసం వేసిన పాక బాగా దగ్గర. ఆ గదిలో కూర్చుని ఆవును మాడవచ్చని అలా ఏర్పాటు చేసుకున్నారాయన. అదే పెద్ద ఇబ్బందయిపోయింది ప్పుడు.

పశువు అన్నాక పాలివ్వడంతోపాటు, పేడ వెయ్యడం లాంటివికూడా దాని సహజ ప్రకృతి లక్షణాలే. దాంతో అదున్న ప్రదేశంలో రొచ్చు కావడం సహజం. అలా ఉన్న చోటులో ఎంత శుభ్రం చేసినా దోమలు చేరడంకూడా అంతే సహజం.

ఇదిగో — ఆ పాకలో చేరిన దోమలన్నీ మూకుమ్మడిగా శర్మగారి గదిలోకి దాడిచేసి ఆయన్ని పీడించడం మొదలుపెట్టాయి. ఫ్యానున్నా నగరంలో కరెంటు కోత సమయంలో వాటి బెడద మరీ తీవ్రం అయిపోయింది. దోమతెరొకటి కొనిపెట్టమని కొడుకుల్ని అడిగేందుకు మొహమాటం. ప్రతిరోజూ దోమలవల్ల నిద్రలేమికి తోడు, ఎంత శుభ్రం చేసినా పాకనుండి వచ్చే పేడవాసన ఒకటి.

ఇలాంటివన్నీ ఇబ్బంది పెడుతుంటే... ఈ బాధలు పడ్డం తనవల్ల కాదనుకున్నారాయన కొద్దిరోజులకే.

'వందల, వేల గజాల విశాలమైన పెరళ్లు వుండే కోనసీమ ప్రాంతంలో లాగా ఈ ఇరుకు హైదరాబాద్ నగర ఇంటి పెరట్లో పశువును పెంచడం కుదుర్తుందా? తన వెర్రి కాకపోతే...' అనుకున్నారాయన.

కానీ, తెమ్మన్నదీ తానే... తెచ్చి రెండు నెలలైనా కాకుండానే తీసుకెళ్లిపొమ్మని కోరిందీ తనే అయితే అదంత బాగుండదని ఆలోచనల్లో పడ్డారు శర్మగారు.

ఆయనలో ఆలోచనల మధనం సాగుతుండగానే... మరి కొద్దిరోజులకే ఆ ఇంట్లో శర్మగారి బాధ తొలిగిపోయే రోజొచ్చింది చిత్రంగానే.

◇ ◆ ◇

"... అది బాబాయ్ సంగతి! నాన్నకు ఆయనెవరో వైద్య శిఖామణి తగిలాడు. యునాని... ఆయుర్వేదం కలిపి వైద్యం చేస్తాడట అతను. అప్పుడే పితికిన ఆవు పాలల్లో ఆయనిచ్చిన గుళికలు రంగరించుకుని తీసుకోవాలట. అదీ రెండు వారాలే. ఈ 'మెగాసిటీ'లో అప్పుడే తీసిన ఆవుపాలెలా దొరుకుతాయి చెప్పు?... ఏదో ఆయన పోరు పడలేక మీ ఆవును ఓ రెండు వారాలపాటు మా ఇంటికి పంపడానికి ఒప్పుకోమని అడగడానికి వచ్చాను. నువ్వు

కాదననే నమ్మకంతోనే..." ఎదరకాళ్లకు బంధం వేస్తూ అన్నాడు భానుమూర్తి.

అతను శర్మగారి అన్న కొడుకు. ఈ భానుమూర్తిని దేవుడే పంపించి వుంటాడనుకున్నారు శర్మగారు. ఆ వయస్సులో సైతం ఎగిరి గంతేయాలని అనిపించింది భానుమూర్తి కోరింది వినగానే. కానీ పైకి మాత్రం "దానిదేం భాగ్యంరా! ఈ రోజే తోలుకెళ్లు. మా ఆవును చూసుకునే మనిషొచ్చి పాలు పితుకుతాడ్లే" అన్నారు.

"థాంక్స్ బాబాయ్! నువ్వు ఇష్టంగా పెంచుకుంటున్న ఆవుకదా... పంపడానికి, దాన్ని వదిలి వుండడానికి ఒప్పుకుంటావో లేదోనని భయపడ్డా..." సంతోషంతో పొంగిపోతూ చెప్పాడు భానుమూర్తి.

ఆరోజే శర్మగారి ఆవు హైదరాబాద్‌నుండి సికిందరాబాద్‌లోని సరోజినీదేవి రోడ్‌లోని భానుమూర్తి ఇంటికి మినీవ్యాన్‌లో తరలి వెళ్లిపోయింది.

◇ ◆ ◇

ఆ ఇంటినుంచి ఆవు వెళ్లిపోయిన వెంటనే శర్మగారు చేసిన మొదటి పని ఆవున్న పాకను శుభ్రంచేయడం. తడిగాను, రొచ్చుగాను వున్న చోట పొడిమన్ను చల్లి దానిపై ముగ్గు చిమ్మారు. ఫినాయిల్ తీసుకుని నేలంతా శుభ్రంగా స్ప్రేచేశారు.

ఈ రెండు పనులతో దోమల బెడదా, వాసనబాధా రెండూ ఎగిరిపోయి ప్రశాంతంగా నిద్రపట్టింది ఆయనకు ఆ రాత్రి. "రోజూ ఇలాగే వుంటే ఎంతో బావుణ్ను" అనే తలంపూ అప్పుడే వచ్చిందాయనకి.

రోజూ రెండు పూటలా పాలను పార్ట్ టైం జీతగాడు సికిందరాబాద్‌లో ఆవున్న చోట్నుంచి తెస్తున్నాడు. అలా మూడురోజులు గడిచేసరికి శర్మగారిలో ఏదో తెలీని వెలితి కనిపించసాగింది. తన గదికి ఎదురుగా కనిపించే పాకలో ఆవు లేకుండా ఖాళీగా వుండడం ఏదో శూన్యాన్ని మనసులో నింపుతున్నట్టు వుంది... రోజూ మంగళకరమైన అంబారావాలతో నిద్రలేచే శర్మగారికి

## నాన్నగారు

"మీ నాన్నగారు వున్నారా?
"ఎందుకండీ?"
"డబ్బివ్వాలి"
"లేరు... నిన్న ఊరెళ్లారు"
"నేనే డబ్బియ్యాలి ఆయనకు"
"పొద్దుటే వచ్చేశారండీ. వుండండి పిలుచుకు వస్తాను"

— కె.వి.మధుసూదనరావు (కాకినాడ)



హైదరాబాద్‌లోని సైరన్ల మోత కర్ణ కఠోరం అయిపోయింది. తను సమీపించగానే ఆ ఆవులో కనిపించే కృతజ్ఞత... కళ్లలో ఆనందం... నాలుగు కాళ్లతో అటూ ఇటూ కదులుతూ అది ప్రకటించే ఉత్సాహం ఆయన కళ్లముందు కదుల్తున్నాయి.

మరి కొద్దిరోజులు గడిచేసరికి ఆ శూన్యంకాస్తా బెరుకుగా, భయంగా మారింది.

మరణించాక వైతరిణీనది దాటుతున్న సమయంలో ఆవు తనని సగం దూరం వరకూ తీసుకువచ్చి వదిలేసినట్టు.... 'నీవు నాకు చేసిన ఉపకారానికి ఈ మాత్రం చాల్లే' అన్నట్టు ఏవో కలలు...

ఆ కలల్లోనే... ఆవును అమ్మెయ్యమని తను చెబితే... అది విన్న కొడుకుల శరీరాల్లోంచి రెండు ఆత్మలు బయటకు రావడం... అందులో నల్లవస్త్రాలు ధరించిన పెద్ద ఆత్మ 'మీ నాన్న పాలిచ్చే ఆవునే తనకు ఇబ్బందిగావుందని వదిలించుకుంటున్నాడు. రేపు మరీ వృద్ధాప్యం మీద పడితే మీ నాన్న పరిస్థితీ అంతే! పడుకున్న మంచంనే పశువులపాకకంటే ఘోరం చేస్తాడు. అప్పుడు నీవుకూడా అతన్ని వదిలించుకోవడం అన్యాయమేమీ కాదు. అందుకే ముందే జాగ్రత్తపడు. మీ నాన్న శక్తి ఉడిగిన ముసలి ఆవు కాకముందే ఇప్పుడే వదిలించుకో...' అంటూ అది హెచ్చరిస్తుంటే... రెండోదైన తెల్ల బట్ట వేసుకున్న మంచి ఆత్మ 'వద్దు.... వద్దు... అది మరీ అన్యాయం...' అని బలహీనంగా అనడం... కొడుకులిద్దరూ నల్లబట్టలు ధరించిన పెద్ద ఆత్మ ప్రభోదంవైపే మొగ్గుచూపడం...

రాత్రీ పగలూ కళ్లు మూసుకుంటే చాలు మీదికొచ్చి పడుతున్న ఆ కలల తాకిడికి తట్టుకోలేకపోతున్నారు శర్మగారు.

దీనికంతటికీ కారణం ఆవును తాను వదిలించుకోవాలని అనుకోవడం... అయినా దాని స్మృతులు తనని వీడిపోకపోవడమేనని అర్థమయిందాయనకు. ఆవు లేక తన హృదయంలో ఏర్పడ్డ శూన్యంను వెంటనే భర్తీచేసుకుంటేతప్ప తనకు శాంతివుండదు.

ఆ సాయంత్రమే సికిందరాబాద్‌లోని సరోజినీదేవిరోడ్‌లోని అన్నగారింటికి ప్రయాణమయ్యారాయన. పెద్ద కొడుకు తన స్కూటర్‌మీద శర్మగారిని జాగ్రత్తగా తీసుకెళ్లాడు. అక్కడ కుశలప్రశ్నలు అయ్యాక, ఆవున్న వైపుకు వెళ్లారాయన.

శర్మగారిని చూడ్డంతోనే ఆవుకు మహదానందం వేసింది. నాలుగు కాళ్లను భూమికి తాటిస్తూ... తలను పలకరింపుగా ఊపుతూ... తన భావాన్ని తెలియజేయసాగింది.

దాని దగ్గరకు వెళ్లి తలమీద చేయివేసి ఆప్యాయంగా నిమిరాడాయన.

ఆ స్పర్శలో 'నువ్వు మన ఇంటికి వచ్చేస్తావు... ఈసారి నిన్ను నేను వదిలిపెట్టను... వదిలించుకోవాలని ఎవరివెంటా పంపను' అనే హామీ వుంది.

తను ఇంతకాలం భరిస్తున్న శూన్యాన్ని భర్తీ చేస్తున్న భావమేమో ఆ స్పర్శనుండి పొందుతున్నట్టుగా ఆ చేయి ఆవు తలను అలా నిమురుతూనే వుంది.

తనకు కావలసినది ఏదో దొరికినట్టుగా... కృతజ్ఞతతో శర్మగారి చేతిని నాలుకతో తడిచేస్తుందా గోవు.

ఆ స్పర్శా ఇద్దరిమధ్యా బంధం పేగుబంధంకంటే గొప్పదేనేమో... అందుకే ఆ స్పర్శా, తడీ... రెండూ స్వచ్ఛమైనవే... గోక్షీరంలా.

◇ ◆ ◇